# శిక్ష

సాయంత్రం ఆరు గంటలకే సినిమాకి పోదామని అనుకుని మాలతితో చెప్పి వెళ్ళిన ఆనందరావు సినిమాహాలువద్దకు పోయి, టిక్కెట్లందక, చిరాకుపడి, యింకెక్కడికీ పోలేక సరాసరి యింటికే వచ్చేశాడు. వచ్చి చూసేటప్పటికి యిల్లు తాళం పెట్టివుంది.

ఆనందరావుకి కోపం ముంచుకు వచ్చింది. జేబులోంచి సిగిరెట్టు పెట్టె తీసి ముట్టించుకుని గోడకి ఆనుకుని గట్టిగా ఒక దమ్ము లాగాడు.

ఎక్కడికి పోయింది? తను సినిమాకని పోయేటప్పటికి యీవిడగారికి షికార్లా? తను కొంతసేపు యింట్లో వుండకపోతే ఆవిడ యిష్టా రాజ్యమన్నమాట. తను యింట్లో వుండేనంతమాత్రాన ఆవిడ అక్కడికీ యిక్కడికీ పెత్తనాలు చేయాలని ఎక్కడ వుంది? 'అహ. ఎక్కడ వుంది అంట?'

ఆవిడగారు, అంటే, మాలతి తిరిగి యింటికి వచ్చేవరకూ తను యిక్కడే యీ సావిట్లో పడిగాపులు కాస్తూ కూచోవాలా? ఏమన్నా న్యాయమేనా యిది? మాలతి తప్పు క్షమించదగిందేనా?

ఒక నిమిషంసేపు తర్జన భర్జనలు చేసుకున్నమీదట ఆనందరావు మాలతిని క్షమించదల్చుకున్నాడు. అంటే కోపం లేక కాదు. మాలతితో అనవసరంగా తిగాదా పడటం యిష్టంలేక. సాధారణంగా పేచీలు పడటం ఆనందరావు అభిమతం ఎంత మాత్రమూ కాదు.

అయితే ఎక్కడికి పోయివుంటుందీ ఆలోచించ దల్చుకున్నాడు ఆనందరావు. ఆలోచించసాగాడు.

ప్రక్క సందులో వున్న సుందరమ్మగారింటికా, లేక పదిళ్ళ అవతలున్న శారద గారింటికా, అదీగాక రెండు సందుల పైమూలలోవున్న కామాక్షమ్మగారింటికా, ఈవిషయం ఆనందరావు ఆలోచించి తేల్చుకోకముందే ఉన్నట్టుండి హఠాత్తుగా అతన్కో కొత్త ఆలోచన ముట్టేసింది. తనకు బాగా అనుమానం. అనుమానమేమిటి? రూఢి. మాలతి నిస్సందేహంగా సుందరమ్మగారింటికి ఎదురుగుండా వున్న పార్వతిగారింటికే పోయివుంటుంది. సందేహంలేదు.

తను అలా అనుకోటానికి కారణవుంది. పొద్దున్న తను ఆఫీసుకు పోతుంటే అంది మాలతి. "పార్వతిగారింటికిపోయి చాలా రోజులయింది. ఒకసారి పోయివచ్చేదా?" అని తను ఆశ్చర్యపోయాడు. "వాళ్ళింటికా? ఎందుకు? ఏవన్నా ఆలోచించుకుని మాట్లాడుతున్నావా? నే నేమన్నా ఆ రాజుగాడి ముందు తలఎత్తుకుని తిరగాలా? చెప్పు" అని అడిగాడు గట్టిగానే.

మాలతి కొంచెంగా ముఖం ముడుచుకుంది. "అదికాదండీ. పాపం పార్వతి ఏంచేసిందీ అని? మొన్న సుందరమ్మగారితో అందిట." మాలతి నాతో యిహ మాట్లాడదల్చుకోలేదా? ఆమెకు అకారణంగా నామీద కోపం ఎందుకూ అని. నిజమే. మాట్లాడకపోవటానికి ఆవిడ ఏంచేసింది పాపం?" అంది.

"నీ మొహంలే" అన్నాడు తను. "నీకేం తెలీదు. నువ్వు వాళ్ళింటికేం వెళ్ళవల్సిన అవసరంలేదు. వెడితే మాత్రం నే నూరుకోను."

కావలిసినంత ఘాటుగానే అన్నాడీ మాటలు తను. అన్నతర్వాత ఆఫీసుకు వెళ్ళిపోయాడు. కాని తన మాటలు మాలతికి ఏమాత్రం సంతృప్తి కలిగించలేదని అప్పుడే అనుకున్నాడు కూడా.

అసలు మాలతి తన నా ప్రశ్న ఎందుకడిగిందా అన్నదే సందేహం. మూడు నెలల క్రితం తనికీ రాజుకీ మాటపట్టింపు వచ్చిన దగ్గర్నుంచీ ఆ యింటి ఛాయలకే పోవటంలేదు తను. మాలతినికూడా పోవద్దన్నాడు. అంతకుముందు రాజుకీ, తనకీ, పార్వతికీ, మాలతికీ అత్యంత స్నేహంవుంటే వుండివచ్చు. తనదగ్గిర మాటంటే మాటే. ఆనాటినుంచీ రాజుతో మాట్లాడలేదు. మాలతి కూడా యివాళ్టివరకూ పార్వతితో మాట్లాడటంలేదనే తన నమ్మకం. మాట్లాడితే తనకెంత చిన్నతనం? ఆ రాజుగాడికి తను లొంగిపోయినట్లేగా. అయితే మరి యీవిడగారికి ఎందుకు పుట్టిందో యీబుద్ధి?

మాలతి తప్పకుండా పార్వతిదగ్గకే పోయివుంటుందని నమ్మాడు ఆనందరావు. ఈసారి అతనికి బాగా కోపం వచ్చింది మాలతిమీద. తనకిష్టం లేనిపని ఎందుకు చెయ్యాలి? చేస్తే శిక్ష అనుభవించవల్సిందే. మాలతిని తను క్షమించకూడదు.

ఆనందరావు మాలతిని క్షమించదల్చుకోలేదు. క్షమించకపోతే ఏంచేసేటట్లు? కొట్టటమా? మాలతిని కొట్టేటందుకు తనకు చేతులురావు. అదీగాక వ్యవహారం అంతదూరం పోవటం తనకూయిష్టంలేదు. అందుచేత ఒకే ఒక నిశ్చయానికి వచ్చాడు. మాలతి గనక నిజం ఒప్పుకున్నట్లయితే ఆవిడ చేసిన తప్పును సహించి క్షమించుదామని. ఒప్పుకోకపోతే? అది తరవాత విషయం.

ఆలోచనలతో నిండిపోయిన ఆనందరావు అడుగుల చప్పుడయితే తలఎత్తి చూశాడు. మాలతి!

మాలతి లోపలకివస్తూ అతన్ని చూసి తెల్లబోయి "మీరు సినిమాకి వెళ్లలేదా?" అనడిగింది.

ఆనందరావు ఆమెవంక తీవ్రంగా చూస్తూ ముందుతలుపు తియ్యి" అన్నాడు సాధ్యమైనంత కర్కశంగా; అలా వుండదల్చుకున్నాడు గనుక. మాలతి తెల్లబోయింది. భర్తమాటలలోని తీవ్రత గ్రహించేటందుకు ఆమెకు ఎక్కువసేపు పట్టలేదు. మాట్లాడకుండా తాళంతీసి తలవంచుకుని లోపలకి నడిచింది. ఆనందరావు చేతిలోని సిగిరెట్టుని విసురుగా అవతల పారేసి అంతకంటే విసురుగా లోపలకు నడిచాడు.

"ఎక్కడకు పోయావు?"

"ఆఁ" అంటూ తలఎత్తి చూసింది అతనివంక మాలతి.

"పార్వతిగారింటికేనా?"

మాలతి ముఖం పాలిపోయింది. అలాగే తెల్లబోయిచూస్తూ ఆమె యీసారి కూడా జవాబు చెప్పేందుకు సిద్ధపడలేకపోయింది.

"అలాగ చూస్తావేం గుడ్లగూబలాగ. నేను వద్దన్నానా? అన్నా ఎందుకు పోయావు? నీకేమన్నా బుద్ధి వుందా?"

మాలతి యీ మాటు సర్దుకోగలిగింది. "కాదు. నేను పార్వతిగారింటికి కాదు వెళ్ళి" అంది హీనస్వరంతో.

"అబద్ధాలు కూడానా? బుకాయించటం కూడా నేర్చుకున్నావన్నమాట."

"అదికాదండీ. నిజంగా. నేను పార్వతిగారింటికి వెళ్ళలేదు. సుందరమ్మగారింటికి వెళ్ళాను" అన్నది మాలతి భయం భయంగానే.

ఆనందరావు చేతులు వెనక్కి పెట్టుకుని పచార్లు చేస్తూ "నే నమ్మను" అన్నాడు. కోపం వస్తే చేయవల్సిన పన్లేమిటో అతనికి బాగా తెలుసును.

నమ్మకపోతే ఏం చేయాలో అర్థం

## ★ నిజం ★

కాలేదు మాలతికి. "నిజంగా. నేను పార్వతిగారింటికి పోలేదు. మీరు వద్దన్నారుగా.

వద్దంటే ఎందుకు వెళ్తాను?" అంది గద్గదికంగా.


# అసలైన గొల్లభామ మార్కు పాలగుర్తు




ఉత్తమమైన వాటిని కొనటం ప్రయోజనకరమని జీవితంలో మనకు త్వరలోనే తెలిసివస్తుంది. శ్రేష్ఠమైన సరుకు కోసం కొంచెం అదనంగా అయ్యేడబ్బు సద్వినియోగమే అవుతుందని మన తలిదండ్రులు యెరిగియుండిరి, మనకూ తెలుసు. కాబట్టే గొల్లభామ మార్కు పాలు అనేక దశాబాలుగ భారత దేశంలో ఏరి, కోరి వాడబడుతున్నది. ప్రజాభిమానం చూరగొన్న ఈ పాలు అట్టి అభిమానానికి పాత్రమయేట్లు తయారు చేయబడ్డవి.

ఆ అదనపు దమ్మిడీల విలువగ్రహించండి,
ఉత్తమమైన వాటినే కొని వాటిని సద్వినియోగం చెయ్యండి

★

వివరములు తెల్పు కరపత్రం కోసం మాకు వ్రాయండి!

# నెసిల్స్ ప్రాడక్ట్సు

**(ఇండియా) లిమిటెడ్,**

**పో. బా. నం. 180, మద్రాసు - 1.**


ఆమె ఏం చెప్పినా నమ్మదల్చుకోలేదు. నిజం ఒప్పుకుంటే క్షమించేటందుకు అతను సిద్ధంగానే వున్నాడు. కాని నిజాన్ని కప్పిపుచ్చుతే మట్టుకు ఆమెని ఏమాత్రం క్షమించదల్చుకోలేదు.

"అయితే వెళ్ళానని ఒప్పుకోవన్నమాట" అన్నాడు గంభీరంగా.

"ఒప్పుకునే దేముంది? నేను వెళ్లందే.."

"నోర్ముయ్."

మాలతి నోరు మూతబడింది. ఆనందరావు అక్కడ్నుంచి చరచర వెళ్లిపోయి మంచం మీద పడుకున్నాడు.

ఎందుకు ఒప్పుకోదు నిజం? తన మాటంటే అంత అలక్ష్యమా? తను భార్యకు అంతలోకు వైపోయాడా?

దీన్ని ఎలా శిక్షించటం? కొడితే? తను కొట్టలేడు. పూరీల్లాంటి మాలతి బుగ్గలు కందిపోయి అసహ్యంగా తయారవుతే తను సహించలేడు. పై పెచ్చుతనే బాధపడవల్సి వస్తుంది.

అయితే ఎలా తన కక్షతీర్చుకోవటం? ఏవిధంగా మాలతి మనస్సుకు బాధకలిగించటం.

అరగంటసేపు అవస్థపడినా ఆనందరావుకి దారీ తెన్నూ తోచలేదు నిజంగా.

అడుగుల చప్పుడు అయితే ఆలోచనల లోంచి తేరుకుని తలఎత్తిచూశాడు. మాలతి.

ఈ కొద్దిసేపట్లో యిలా ఎందుకు మారిపోయింది? కళ్లెందుకంత ఎర్రబడ్డాయి! చెంపలమీద ఆ చారలేమిటి? జుట్టలా రేగిపోయిందేం?

ఇవన్నీ చూసింతర్వాత, తనకోపం మాట గుర్తుకొచ్చి తల ప్రక్కకి తిప్పుకున్నాడు ఆనందరావు.

"అన్నం వడ్డించాను."

ఆనందరావు మాట్లాడలేదు. కనీసం మాట్లాడదల్చుకోలేదు.

"ఏమ్మర్లేన్నా!"

తననే అని తెలియక కాదు మాట్లాడక పోవటం.

మాలతి దగ్గరకొచ్చి అతని భుజంమీద ముఖంపెట్టి అడిగింది దీనంగా, "నేనేం చేశానని అంతకోపం?"

తనేం చెయ్యకపోతేనే వచ్చిం దేమిటి కోపం?

"నామీద కోపమైతే భోజనం మానెయ్యట మెందుకు?"

నిజమే. మాలతిమీద కోపంవస్తే తను భోజనం మానేయటం ఎందుకో తెలియటం లేదు.

మాలతి అతని మౌనాన్ని సహించలేక ముందుకువచ్చి అతనిముఖాన్ని చూసేందుకు ప్రయత్నిస్తూ "నామీద అలిగి మీరు

భోజనం మానేస్తే నా మనస్సెంత బాధ పడుతుందో తెలుసునా?" అంది అమాయకంగా.

ఆనందరావుకి ఆయువుపట్టు చేజిక్కింది. అరగంట బుర్ర బద్దలు కొట్టుకుంటే అలవిగాని విషయం మాలతి యీ ఒక్క మాటతో తీర్చి వేసింది. అంటే తను భోజనం చెయ్యకపోతే ఆమె మనస్సు బాధ పడుతుందన్న మాట. తను మాలతిని ఏడిపించాలంటే భోజనం చెయ్యకూడదు.

"నేను భోంచెయ్యను"

"ఎందుకు?"

"నాయిష్టం" ఆనందరావు వెంటనే నాలుక కొరుక్కున్నాడు. "నువ్వెందుకు నిజం చెప్పలేదు?" అని అడగలేదని. కాని ఆ సమస్య మాలతే తీర్చి వేసింది.

"నేను అబద్ధం ఆడాననా?"

ఆనందరావు యీ అవకాశాన్ని వృధా చేసుకోలేదు. "లేకపోతే?" అని ముఖం యిటు తిప్పకుండానే జవాబు చెప్పాడు.

"నేను పార్వతిగారింటికి వెళ్లిందే?"

"ఆమాటే వద్దన్నాను."

"నేను నిజమే చెప్తున్నానండీ" అన్నది మాలతి గద్దదికంగా. ఆనందరావు మెత్తపడలేదు.

"అయితే నేను భోజనానికి రానవసరం లేదు. నువ్వు వెళ్ళి తినెయ్యి" అన్నాడు ఆమెవంక చూడకుండానే.

"మీరు రాకుండానా?"

"అభ్యంతరం లేకుండా. నేను చివరికి నీచేత నిజం చెప్పించలేకపోయానుగా. నన్ను నువ్వు లెక్క చెయ్యనంతవరకూ వచ్చిందన్నమాట. అందుకనే నా విషయం నీకనవసరం. నీ సంగతేదో నువ్వేడు."

మాలతి ఒకనిమిషం మాట్లాడలేదు. ఆనందరావు మెల్లిగా ప్రక్కకు తిరిగిచూసే సరికి ఆమె ఏడుస్తున్నది. "ఏడవనీ? దాని చేత నిజం చెప్పించలేక పోయింతర్వాత అదేంచేస్తే నాకేం? అనుకున్నాడు.

అయిదునిమిషాలు నిశ్శబ్దంగా గడిచాయి. మాలతి, ఆనందరావువంక తేజోవిహీనంగా చూసింది.

"అయితే నిజంచెప్తే వస్తారా?"

ఆనందరావుఉలుక్కిపడ్డాడు. "చెప్పు" అన్నాడు, మిగిలిన భావమంతా ఆ ఒక్క ముక్కలోనే యిముడుస్తూ.

"కోప్పడతారా?"

"లేదులే"

"అయితే...అయితే నేను యిందా! పార్వతిగారింటికే వెళ్ళాను" మాలతి నెమ్మదిగా, బలహీనంగా అన్నది.

ఆనందరావుకు ఎగిరి గంతేయాలన్నంత ఉత్సాహం కలిగింది. ఉత్సాహమంతా ఒక్కసారే చూపిస్తే తన తెలివితక్కువతనం బట్టబయలవుతుంది. "ఇప్పటికి నిజం చెప్పావన్నమాట. అయితే పద. భోజనానికి"అంటూ లేచాడు. మాలతి చేతనిజం చెప్పించానన్న గర్వం అతన్ని ఆవహించింది.

తను భర్తతో కలిసి భోజనం చేసినా భర్త తనతో కులాసాగా కబుర్లు చెప్పినా మాలతికి మాత్రం బాధగానే వుంది. "నే నాయన్ని నిజంచెప్పి ఎందుకు నమ్మించలేక పోయాను?" అని. ★

"నాకు తెలుసును
లక్స్ టాయిలెట్ సబ్బు మీ చర్మమును
ఇంక మనోహరముగాచేయును"
అని
మాలతి
చెప్పుచున్నది






"శుద్ధమైన ఈ తెల్లటి సబ్బు నా చర్మముమీద వదిలి పెట్టు సువాసనంటె నాకు మిక్కిలి ఇష్టము." అని మాలతి చెప్పుచున్నది. ఆమె ఇంకా ఇలాగువ చెప్పుచున్నది: "మనోహరమైన చర్మ సౌందర్యమునకు నావలె చేయండి. లక్స్ టాయ్‌లెట్ సబ్బుతో మీ చర్మమునకు ప్రతిదిన సంరక్షణమ ఇవ్వండి."

లక్స్ టాయ్‌లెట్
సబుబ

సినీమా తారలకు సౌందర్యమునిచ్చు సబ్బు

L.T.S. 333-X30 TL